సాక్షి
అనంతపురం
గురువారం । 3 । జూలై । 2025





**రెండంటే.. రెండే రోజులు**

రైతులను నైరుతి రుతుపవనాలు నిరాశపరిచాయి. మొదట్లో ఊరించి తర్వాత ఉసూరుమనిపించాయి.

8లో



**చీనీ టన్ను రూ.25 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

34.9°/23.7°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### అరటి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**తాడిపత్రి రూరల్:** మండలంలో అరటి పరిశోధన కేంద్రం ఏర్పాటు కోసం బుధవారం కలెక్టర్ వినోద్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. భోగసముద్రం, తలారిచెరువు, వెంకటాంపల్లి గ్రామాల పొలాల్లో నాలుగైదు గంటలు కలియ దిరిగారు. టిష్యూ కల్చర్ పద్ధతిలో అరటి మొక్కల ఉత్పత్తి కోసం 50 ఎకరాల్లో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కలెక్టర్ వెంట ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ సోమశేఖర్, సర్వేయర్ రామ్మోహన్, ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి ఉన్నారు.

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు



**అనంతపురం ఎడ్యుకేషన్:** జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2026కు జిల్లాలో అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. దరఖాస్తుకు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ మార్గదర్శకాలు https://nationalawardstoteacher.education.gov.in బ్లాగ్‌స్పాట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. దరఖాస్తుకు వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి సంబంధిత అధికారి ద్వారా ధ్రువీకరించిన హార్డ్‌కాపీలను ఈనెల 10లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### ఆటంకం సృష్టించారు.. సంజాయిషీ ఇవ్వండి

- ముగ్గురు గ్రామ సర్వేయర్లకు షోకాజ్

**అనంతపురం అర్బన్:** సచివాలయ గ్రామ సర్వేయర్లకు సంబంధించి గత నెల 29న జరిగిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియకు అడుగడుగునా ఆటంకాలు, అసౌకర్యం కల్పించారంటూ ముగ్గురు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు సర్వే భూరికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ సంజాయిషీ కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలం జౌకులకొత్తపల్లి సచివాలయ గ్రామ సర్వేయర్ ఎం.మహేష్‌నాయుడు, అగళి మండలం అగళి సచివాలయ గ్రామ సర్వేయర్ యు.తిప్పేస్వామి, అనంతపురం జిల్లా గుత్తి మండలం కరాడికొండ సచివాలయ గ్రామ సర్వేయర్ ఎస్.రవికుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసు అందిన మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే తీవ్రంగా పరిగణిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### జలజలా తుంగభద్రమ్మ..

- టీబీ డ్యాం 6 క్రస్ట్ గేట్లు ఎత్తి నదికి నీరు విడుదల



తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల ద్వారా నదికి పోతున్న నీరు

**బొమ్మనహాళ్:** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందిస్తున్న తుంగభద్ర జలాశయం 6 క్రస్ట్ గేట్లను ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు. 14,136 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. డ్యాం ఎగువ భాగంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా రిజర్వాయర్‌కు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి 32,494 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1,625.46 అడుగులకు చేరుకుంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 78.100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 80 టీఎంసీలకు చేరువలో ఉండటంతో బుధవారం మధ్యాహ్నం డ్యాం క్రస్ట్ గేట్లలో నాలుగింటిని, రాత్రి 7 గంటల సమయంలో మరో రెండింటిని ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలోనే తుంగభద్ర నదీ పరివాహక గ్రామ ప్రజలను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు.

# ఏ ముఖంతో ప్రజల్లోకెళ్తారు






'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సతీష్ రెడ్డి, విశ్వ, అనంత, నరేష్‌కుమార్‌రెడ్డి, ప్రణయ్ రెడ్డి తదితరులు, పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ఏడాదిలో ఏం సాధించారో చెప్పే దమ్ము కూటమి నేతలకు ఉందా?
- అభివృద్ధి, సంక్షేమం గాలికొదిలేసి సుపరిపాలన అంటారా?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ధ్వజం
- కూటమి మోసాలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు పిలుపు

**ఉరవకొండ:** ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అన్ని వర్గాలను దారుణంగా మోసగించిన కూటమి ప్రజాప్రతినిధులు నేడు ఏ ముఖం పెట్టుకుని సుపరిపాలన అంటూ ప్రజల్లోకి వెళ్తారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఉరవకొండ పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సతీష్‌రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న తదితరులు హాజరయ్యారు. ముందుగా పార్టీ నియోజకవర్గ, మండల, అనుబంధ సంఘాల కమిటీల్లో నియమితులైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో.. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయకుండా నగదు మొత్తం పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. 'తల్లికి వందనం'తో పిల్లల తల్లులను మోసగించారన్నారు. 87 లక్షల మందికి రూ.13 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే, కేవలం రూ.8 వేల కోట్లు ఇచ్చారని విమర్శించారు. ముఖ్యంగా రైతాంగాన్ని నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది కాలంలోనే వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. అభివృద్ధి, సంక్షేమం గాలికొదిలేసింది కాక 'సుపరిపాలన' అంటుండడం సిగ్గుచేటన్నారు. ఏడాదిలో ఏం సాధించారో చెప్పే దమ్ము కూటమి నేతలకు ఉందా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్దామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

### రాష్ట్రంలో అరాచక పాలన



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ పీఏసీ సభ్యులు వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటు చూసినా అరాచక పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ అణచివేత, కక్షపూరిత చర్యలతో ప్రజల్లో భయాందోళన నెలకొందన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని జనాల్లోకి రానివ్వకుండా అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. జగన్‌ను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోందని, ఆయన బయటకు వస్తే వారికి నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. ఉరవకొండలో శాంతియుత కార్యక్రమాల్లో పాల్గొన్నా తప్పుడు కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నేతలను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 2 వేల మంది నాయకులకు పార్టీ నియోజకవర్గ, మండల కమిటీలు, అనుబంధ సంఘాల్లో అవకాశం కల్పించామని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



చంద్రబాబు ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించేందుకు నాయకులు సన్నద్ధం కావాలి. గత ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన బాండ్లతో పాటు చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ బాధ్యతను ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త తీసుకోవాలి. – నరేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు

### సీమ సస్యశ్యామలం ఘనత వైఎస్సార్‌దే



రాయలసీమను కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేసిన ఘనత దివంగత నేత వైఎస్సార్‌కే దక్కుతుంది. జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కృషి చేశారు. గతంలో వైఎస్ జగన్ కూడా హంద్రీ–నీవా ఆయకట్టుకు సాగు నీరివ్వాలని డిమాండ్ చేస్తూ ఉరవకొండ వేదికగా నిరసన కార్యక్రమం చేపట్టారు. హంద్రీ–నీవా గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదు.
– అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు

### ఎన్ని ఇబ్బందులు పెట్టినా తగ్గేదేలే



ఎన్ని ఇబ్బందులు పెట్టినా తగ్గేదే లేదు. ఉరవకొండ నియోజకవర్గంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నా మంత్రి కేశవ్‌కు కన్పించడం లేదు. ఆయన స్వగ్రామం కొకుంట్లలో ప్రజలు ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఏడాదిలో ఉరవకొండకు కేశవ్ చేసిందేమిటో చెప్పాలి.
– వై.ప్రణయ్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్

# అధికారులు అన్యాయం చేశారు



తమకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వచ్చిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు

- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆవేదన
- రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేశారని మండిపాటు

**అనంతపురం అర్బన్:** బదిలీల కౌన్సెలింగ్‌లో అధికారులు తమకు తీవ్ర అన్యాయం చేశారని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించలేదన్నారు. ర్యాంక్ (మెరిట్) ఆధారంగా బదిలీలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా స్థానాలు కేటాయించారని మండిపడ్డారు. రాజకీయ సిఫారసు ఉన్నవారికి వారు కోరుకున్న స్థానాలు కేటాయించారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా సచివాలయ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గతనెల 28న బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. ఆరోజున కౌన్సెలింగ్‌కు హాజరైన తమ నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకున్నారే తప్ప స్థానాలు కేటాయించలేదన్నారు. అదేమని అడిగితే మీ ఆప్షన్లలో ఏదో ఒకటి ఇస్తామని చెప్పారన్నారు. తీరా పోస్టింగ్ ఆర్డర్స్ ఒకటో తేదీన పంపారని, అందులో తామిచ్చిన ఆప్షన్లకు సంబంధం లేని మండలాల్లో పోస్టింగ్ ఇచ్చారన్నారు. ముందు ర్యాంకులో ఉన్న తమను కాదని తరువాత ర్యాంక్ వాళ్లకు తమ స్థానాలు ఇచ్చారని ఆరోపించారు. అంతే కాకుండా దివ్యాంగులు, మెడికల్, ఒంటరి మహిళలు, స్పౌజ్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఇలా బదిలీల కౌన్సెలింగ్‌లో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చేసిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు నేత్ర, జహీర్, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

#### ర్యాంక్ ప్రకారం ఇవ్వలేదు

ఉమ్మడి జిల్లాలో నాది 6వ ర్యాంకు. శ్రీసత్యసాయి జిల్లాలో 3వ ర్యాంక్. నేను కదిరిలో పనిచేస్తున్నాను. బదిలీల్లో కదిరి, నల్లచెరువు, గాండ్లపెంట ఆప్షన్ ఇచ్చా. కానీ, నాకు ముదిగుబ్బ మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. నేను ఆప్షన్‌లో ఉంచిన స్థానాలను ఇవ్వకుండా నా తరువాత ర్యాంక్ వారికి కేటాయించారు.
– జనార్ధన్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

#### ఇష్టానుసారంగా ఇచ్చారు

ఉమ్మడి జిల్లాలో నాది 5వ ర్యాంక్, శ్రీ సత్యసాయి జిల్లాలో 2వ ర్యాంక్. నేను తలుపుల మండలంలో పని చేస్తున్నా. నల్లచెరువు, ఎన్‌పీకుంట, నల్లమాడ మండలాలకు ఆప్షన్ ఇచ్చాను. అయితే నా ఆప్షన్లు కాకుండా తనకల్లు మండలం కోటపల్లి సచివాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. నా తరువాతి ర్యాంకు వారికి నా ఆప్షన్ స్థానాలు ఇచ్చారు.
– సుస్మిత, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

# పచ్చ నేతల పైశాచికం

- రైతుల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల తొలగింపు
- మట్టి దందాపై సమాచారమిచ్చారన్న అక్కసుతో దాష్టీకం



దొడగట్టలో రైతుల విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్న దృశ్యం

**డీ హీరేహాళ్(రాయదుర్గం):** అధికార అండతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. తమ దందాలకు అడ్డు చెప్పే వారిపై వేధింపులకు పాల్పడుతున్నారు. తాము ఏం చేసినా చెల్లుతుందనే రీతిలో వ్యవహరిస్తున్నారు. మట్టి దందాపై సమాచారమిచ్చారన్న కోపంతో రైతుల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు దౌర్జన్యంగా తొలగించారు. రాయదుర్గం నియోజకవర్గం డీ హీరేహాళ్ మండలం దొడగట్టలో జరిగిన ఈ ఘటన అధికార పార్టీ నేతల దాష్టీకాలకు పరాకాష్టగా నిలుస్తోంది. వివరాలు.. దొడగట్ట చెరువులో కొద్ది రోజులుగా భారీ ఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. జేసీబీలతో టిప్పర్లలోకి లోడ్‌చేసి పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని సండూరు, రాంపురం, బళ్లారి తదితర ప్రాంతాల్లో ఇటుకల బట్టీలకు ఒక్కో ట్రిప్పు మట్టి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ దందా వెనుక గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి హస్తం ఉన్నట్లు ఆ ప్రాంతమంతా కోడై కూస్తోంది.

**మెట్టుతో కలిసి పట్టించారనే కోపంతో..**

మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టిన దొడగట్ట చెరువును నాలుగు రోజుల క్రితం రైతులతో కలసి వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సందర్శించారు. అక్కడి నుంచి కర్ణాటక సరిహద్దులో మార్తల్ వద్ద నిల్వచేసిన సుమారు వంద ట్రిప్పుల మట్టిని పరిశీలించారు. అక్కడి నుంచే కళ్యాణదుర్గం ఆర్డీఓ, రాయదుర్గం రూరల్ సీఐ, మైనర్ ఇరిగేషన్ డీఈ తదితరులకు ఫోన్ చేసి.. అక్రమాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మెట్టుతో కలిసి తమ దందాను బట్టబయలు చేశారనే అక్కసుతో రైతులపై టీడీపీ నాయకులు కక్ష సాధింపులకు దిగారు. విద్యుత్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి చెరువులో బోర్లు ఉన్నాయనే సాకుతో రైతులు ఈశ్వరప్ప, పెద్ద అంజినేయులు, మేటి బసవరాజు, వండ్రప్పకు చెందిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తొలగించి సర్వీసులు నిలిపివేయించారు. టీడీపీ నాయకుల దాష్టీకం కారణంగా పొలాల్లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మరీ ఇంత దారుణమా?



టీడీపీ నాయకుల దందాను బయటపెట్టారనే అక్కసుతో రైతుల విద్యుత్ కనెక్షన్లు తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి మండిపడ్డారు. తొలగించిన కనెక్షన్లను పునరుద్ధరించకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మంత్రి నారా లోకేష్ అమల్లోకి తెచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగం రైతుల్ని కూడా వదలడం లేదని మండిపడ్డారు. మానవత్వం ఉన్నవారెవరూ ఇలాంటి దారుణానికి ఒడిగట్టారన్నారు. విప్ కాలవ శ్రీనివాసులుకు ఇలాంటి దారుణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# శింగనమల టీడీపీలో ఆరని కుంపట్లు

- అనంతపురం ఆర్‌అండ్‌బీ వేదికగా మరోసారి భగ్గుమన్న విభేదాలు
- ఎమ్మెల్యే, ద్విసభ్య కమిటీ వర్గీయుల రచ్చ



ఆర్‌అండ్‌బీ బంగ్లా ముందు కేకలు వేస్తున్న టీడీపీ నాయకులు

**శింగనమల:** శింగనమల టీడీపీలో కుంపట్లు ఆరడం లేదు. అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ వేదికగా మరోమారు వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. శింగనమల నియోజకవర్గంలో పలు కమిటీల నియామకంపై బుధవారం అనంతపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆలం నరసానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండలాల్లోనే సమావేశాలు ఏర్పాటు చేసి ఎంపిక చేస్తే బాగుంటుందని సూచించగా.. ఎమ్మెల్యే శ్రావణి నిరాకరించారు. ఆ విధంగా కాదని, పేర్లను ఇక్కడే తెలిపితే నమోదు చేస్తామని చెప్పడంతో వాదోపవాదాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే కొందరు టీడీపీ కార్యకర్తలు మాట్లాడుతూ ఇప్పటికే మండలాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్ పోస్టులను మీ వారికే ఇచ్చుకున్నారని, పార్టీలో పని చేసే వారికి ఇవ్వరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పార్టీని నాశనం చేస్తున్నారు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అంటూ ద్విసభ్య కమిటీ సభ్యులతో కలిసి సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. దీనిపై ఎమ్మెల్యే వర్గీయులు కూడా అంతే స్థాయిలో ప్రతిస్పందించడంతో ఉద్రిక్తత నెలకొంది. అరుపులు, కేకలు వేయడంతో గందోరగోళం నెలకొంది. పోలీసులు స్పందించి అక్కడి నుంచి అందరినీ బయటకు పంపించి వేశారు.

# హౌస్‌సర్జన్లకు స్టైఫండేదీ?

- మూడు నెలలుగా అందని వైనం
- మంత్రి ఉన్నా దుస్థితి



**అనంతపురం మెడికల్:** కూటమి ప్రభుత్వంలో స్టైఫండ్ అందక హౌస్‌సర్జన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకాలోని అనంతపురం సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే హౌస్‌సర్జన్లకు సకాలంలో స్టైఫండ్ అందకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. వివరాలు.. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రస్తుతం 2కే20 బ్యాచ్‌కు చెందిన హౌస్‌సర్జన్లు 149 మంది ఉన్నారు. వీరికి మూడు నెలల నుంచి స్టైఫండ్ అందడం లేదు. హౌస్‌సర్జన్లు 24 గంటలూ విధుల్లో ఉంటారు. ఓపీల్లో రాత్రి వేళ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎంతో మంది పేద, సామాన్య మధ్యతరగతి కుటుంబాల పిల్లలు నీట్‌లో అర్హత సాధించి ఎంబీబీఎస్ చివరి దశకు వచ్చారు. ఈ క్రమంలో సకాలంలో స్టైఫండ్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక.. ఆస్పత్రిలో 50 మంది హౌస్‌సర్జన్లకు మాత్రమే డైట్ అందిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో హౌస్‌సర్జన్లకు డైట్ ఇవ్వాలని వారు కోరుతున్నారు. అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ముందు భావి వైద్యుల కష్టాలు తీర్చాలని పలువురు అంటున్నారు.

## క్లుప్తంగా

### అరటి మొక్కల నరికి వేత



నరికివేసిన అరటి మొక్కలను చూపుతున్న కౌలు రైతు విజయ్‌కుమార్

**తాడిపత్రి టౌన్ (పెద్దవడుగూరు):** పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కౌలు రైతు విజయ్‌కుమార్ సాగు చేసిన తోటలోని అరటి మొక్కలను దుండగులు నరికి వేశారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తోటలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 450 మొక్కలు నరికి వేసినట్లు బాధిత కౌలు రైతు విజయ్‌కుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ రామసుబ్బయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### బతికుండగానే చంపేశారు!

**కుందుర్పి:** మండల కేంద్రానికి చెందిన సరోజమ్మ బతికి ఉండగానే చనిపోయినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదైంది. 64 ఏళ్ల వయసున్న ఆమెకు ప్రతి నెలా వింతతు పింఛన్ అందుతోంది. ఈ నెల 1న పింఛన్ తీసుకునేందుకు వెళ్లగా... ఆమె మృతి చెందినట్లుగా రికార్డుల్లో ఉందని, పింఛన్ మొత్తాన్ని ఇవ్వడం కుదరదంటూ అధికారులు తెలపడంతో ఆమె అవాక్కైంది. మూడేళ్ల క్రితమే తన భర్త చనిపోగా, అప్పటి నుంచి తనకు వితంతు పింఛన్ అందుతోందని, తాను చనిపోయినట్లుగా ఎవరు చెప్పారో తెలపాలని ఎంపీడీఓ లక్ష్మీశంకర్, ఇతర అధికారులను వృద్ధురాలు నిలదీసింది. దీంతో స్వీయరక్షణలో పడిన అధికారులు... ఉన్నతాధికారులతో చర్చించి వచ్చే నెల నుంచి పింఛన్ అందజేస్తామని నమ్మబలికారు.

### ఏఎంసీ మెస్ బిల్లు స్వాహా కేసులో ఉద్యోగి అరెస్ట్

**అనంతపురం:** అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ) మెస్ బిల్లులో రూ.20 లక్షలు స్వాహా చేసిన ఉద్యోగిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ బుధవారం వెల్లడించారు. మెడికల్ కళాశాలలో మహిళా విద్యార్థినులకు సంబంధించిన మెస్ బిల్లులను హాస్టల్ బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేయించాల్సి ఉంది. అయితే ఆ విభాగంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న వాణి అలియాస్ ఎస్.ఓబులేశ్వరి ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తూ తన వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు మెస్ బిల్లుల మొత్తాన్ని బదిలీ చేయించుకున్నారు. కొన్ని నెలలుగా మెస్ బిల్లుల మొత్తం హాస్టల్ బ్యాంకు ఖాతాకు జమ కాకపోవడంతో జీఎంసీ అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు ఆరా తీశారు. దీంతో వాస్తవాలు బయటపడడంతో ఈ అంశంపై విచారణకు ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీని వేశారు. ప్రాథమిక విచారణ అనంతరం అక్రమాలు బహిర్గతం కావడంతో నలుగురు డాక్టర్లతో కూడిన మరో కమిటీ ద్వారా సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా డాక్టర్ మాణిక్యరావు ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు వాణిపై కేసు నమోదు చేశారు. పక్కా ఆధారాలతో బుధవారం వాణి అలియాస్ సాకే ఓబులేశ్వరిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

# రెండంటే.. రెండే రోజులు

**ముఖం చాటేసిన నైరుతి**

- జూన్‌లో కేవలం రెండు రోజుల వర్షం
- 61.2 మి.మీ గానూ 47.1 మి.మీ వర్షపాతం
- నిరాశాజనకంగా 'సాగు'తున్న ఖరీఫ్ ఏరువాక

**అనంతపురం అగ్రికల్చర్:** అన్నదాతలు ఆశలు పెట్టుకున్న 'నైరుతి' ముఖం చాటేసింది. ముంగారుకు ముందుగానే మురిపించిన రుతుపవనాలు తర్వాత ఏ మాత్రం ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా జిల్లాలో ఖరీఫ్ ఏరువాక నిరాశాజనకంగా 'సాగు'తోంది.

**కేవలం 30 వేల ఎకరాల్లో సాగులోకి పంటలు**

ఈ ఖరీఫ్‌లో 8.48 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేయగా జూన్ నెలాఖరుకు 30 వేల ఎకరాలకే పరిమితమైంది. ఇందులో వేరుశనగ 9 వేల ఎకరాలు, కంది 10 వేల ఎకరాల్లో రాగా పత్తి, ఆముదం, ఇతర పంటలు కొంత విస్తీర్ణంలో విత్తారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 61.2 మి.మీ కాగా 23.2 శాతం తక్కువగా 47.1 మి.మీ నమోదైంది.



**ముందస్తుగానే ఆశల 'నైరుతి'**

గతంలో ఎన్నడూ లేని విధంగా కీలకమైన నైరుతి రుతుపవనాలు ఈ సారి జూన్ 2న జిల్లాలోకి ప్రవేశించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశించారు. అనుకున్నట్లు పంటలన్నీ సాగులోకి వస్తాయని అంచనా వేశారు. కానీ... రుతుపవనాలు ప్రవేశం తర్వాత పెద్దగా ప్రభావం చూపలేదు. జూన్ 8న, 11న మాత్రమే అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. జూన్ 15 నుంచి పంటలు వేసుకునేందుకు సమయమని శాస్త్రవేత్తలు ప్రకటించారు. అలాగే ఏరువాక పౌర్ణమి కూడా వచ్చేసింది. అంతేకాక జూన్ 22న రైతులకు ఇష్టమైన ఆరుద్ర కార్తె కూడా ప్రవేశించింది. దీంతో పంటలు విత్తుకునేందుకు అన్ని శుభగడియాలు రావడంతో వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రోజూ మేఘాలు ఆవరిస్తున్నా 15 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న బలమైన గాలుల ధాటికి చెల్లాచెదరవుతున్నాయి. అక్కడక్కడ గాలితెరలు, తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. అరకొర వర్షాలకే అక్కడక్కడ పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు.

**21 మండలాల్లో లోటు వర్షపాతం**

ముంగారు పంటలు విత్తుకునేందుకు మంచి అదను వచ్చినా వరుణుడు కరుణించ లేదు. ఈ నెల 15వ తేదీ వరకు విత్తుకునేందుకు మంచి సమయమని చెబుతున్నా... అది కూడా దగ్గర పడుతున్నందున రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61.2 మి.మీ కాగా 47.1 మి.మీ నమోదైంది. 23.2 మి.మీ తక్కువగా కేవలం రెండు వర్షపు రోజులు నమోదయ్యాయి. అందులోనూ 21 మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా వర్షాలు కురిశాయి. గుంతకల్లు, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పామిడి, కూడేరు, పుట్లూరు, యల్లనూరు, నార్పల తదితర మండలాల్లో అయితే వర్షం జాడ కనిపించ లేదు. ఈ పది మండలాల్లో సాధారణం కన్నా 60 నుంచి 90 శాతం తక్కువగా వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మిగిలిన మండలాల్లో కూడా ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు. కణేకల్లు, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు లాంటి ఐదారు మండలాలు మినహా తక్కిన అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక జూలైలో సాధారణ వర్షపాతం 63.9 మి.మీ మేర నమోదు కావాల్సి ఉంది. జూలై 15 లోపు జిల్లా అంతటా వర్షపాతం సాధారణ స్థితికి చేరుకుంటే ఖరీఫ్ ఏరువాకకు ఇబ్బంది ఉండదు. లేదంటే మరోసారి కరువు ఛాయలు తప్పవని రైతులు అంటున్నారు.

### రిజర్వాయర్లలో చేపల వేట నిషేధం

**అనంతపురం అగ్రికల్చర్:** గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)తో పాటు గార్లదిన్నె మండలం మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)లో 62 రోజుల పాటు చేపల వేటపై నిషేధం విధించినట్లు మత్స్యశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) చంద్రశేఖరరెడ్డి తెలిపారు. లీజ్ అగ్రిమెంట్ ఉన్న పీఏబీఆర్‌లో కూడా పాక్షికంగా నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఈ నిబంధన అమలులోకి వస్తుందన్నారు. చేపల సంతానోత్పత్తికి జూలై, ఆగస్టు నెలలు అనుకూల సమయం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. లైసెన్సు దారులు, మత్స్యకారులు రెండు నెలల పాటు చేపలు పట్టకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుత 2025–26 సంవత్సరంలో అనంతపురం, బీటీపీ, పీఏబీఆర్, ఎంపీఆర్ మత్స్య క్షేత్రాల్లో 5.50 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎంపీఆర్‌లో ఇప్పటికే 50 లక్షల చేపపిల్లల ఉత్పత్తి మొదలైందన్నారు. కట్ల, రోహు, మృగాల, బంగారుతీగ రకాల ఉత్పత్తి ఉంటుందని తెలిపారు. అధీకృత రిజర్వాయర్లకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ ఉంటుందని, మిగిలిన ప్రాజెక్టులు, చెరువులకు రాయితీతో చేపపిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే చేపల వేట నిషేధంపై బీటీపీ, ఎంపీఆర్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఎఫ్‌డీఓలు) ఆసీఫ్, లక్ష్మీనారాయణ బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

# 'కూటమి' దగా చేసింది

- ధాన్యం కొనుగోలు చేసి డబ్బులివ్వలేదు
- 400 మంది రైతులకు రూ.6.96 కోట్ల బకాయిలు
- మూడు నెలలవుతున్నా పట్టించుకోలేదు
- కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వం తమను దగా చేసిందంటూ రైతులు వాపోయారు. ధాన్యం కొనుగోలు చేసి మూడు నెలలవుతున్నా నేటికీ డబ్బు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి డబ్బు తక్షణమే చెల్లించాలంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో బొమ్మనహాళ్, కణేకల్లు రైతులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, రైతులు మాట్లాడారు. వరి మద్దతు ధర క్వింటా రూ.2,320 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసి, ఏడు రోజుల్లోపు బ్యాంక్ ఖాతాల్లోకి నగదు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బొమ్మనహాళ్, కణేకల్లు రైతులు

జమ చేస్తుందని అధికారులు తెలిపారన్నారు. దీంతో బొమ్మనహాళ్ మండల పరిధిలో 120 మంది రైతులు, కణేకల్లు మండలంలో 280 మంది రైతులు మద్దతు ధరతో పంటను ప్రభుత్వానికి విక్రయించారన్నారు. దాదాపు 400 మంది రైతులకు రూ.6,96,02,656 చెల్లించకుండా మూడు నెలలుగా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కార్యాలయాలు, సొసైటీల చుట్టు తిరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సేద్యం పనులు చేపట్టాల్సిన ప్రస్తుత తరుణంలో విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ఇతర పనులకు పెట్టుబడులు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం డబ్బు చెల్లించకపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో నాయకులు, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు నారాయణస్వామి, నాగార్జున, తిప్పేస్వామి, తేజ, రైతులు పాల్గొన్నారు.

**దిక్కుతోచడం లేదు**

మాకున్న 10 ఎకరాలకు తోడుగా 60 ఎకరాలు గుత్తకు తీసుకుని వరి పండించాను. 1,750 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధర క్వింటా రూ.2,320తో ప్రభుత్వం కొనుగోలు చేసి, వారంలో డబ్బు ఖాతాలో జమ చేస్తుందని అధికారులు చెప్పారు. దీంతో మొత్తం పంట ప్రభుత్వానికే అమ్మాను. మూడు నెలలు అవుతున్నా నాకు చెల్లించాల్సిన రూ.40 లక్షలకు అతీగతీ లేకుండా పోయింది. అధికారులను అడిగితే ప్రభుత్వం చెల్లిస్తుందని చేతులెత్తేశారు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

– రైతు రామాంజనేయులు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

**పెట్టుబడికి డబ్బుల్లేవు**

నాకు రూ.7.20 లక్షలు రావాలి. మూడు ఎకరాలు నా సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు గుత్తకు తీసుకుని వరి పండించాను. కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం నుంచి డబ్బులు ఖాతాల్లో జమవుతాయని అధికారులు చెప్పడంతో 320 క్వింటాళ్లు ధాన్యం ఇచ్చాను. మూడు నెలలు అవుతోంది. ఇప్పటికీ నయా పైసా జమ కాలేదు. అప్పులు చెల్లించాలి. ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి డబ్బులు లేవు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– తిమ్మప్ప, గౌనూర్, బొమ్మనహాళ్ మండలం

# జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని గైనిక్ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో రోగికి ప్రాణం పోశారు. వివరాలు... గుత్తికి చెందిన లక్ష్మి గత నెల 23న ఆయాసం, రక్తహీనతతో బాధపడుతూ జీజీహెచ్‌లోని గైనిక్ ఓపీకి వచ్చింది. ఆమె పరిస్థితిని గమనించిన వైద్యులు అడ్మిట్ చేసుకుని,, పలు రకాల స్కానింగ్‌లు నిర్వహించారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 4.3 ఉన్నట్లు నిర్ధారణ కావడంతో పాటు గర్భసంచికి రెండు వైపులా భారీ పరిమాణంలో కణితులు పెరిగినట్లుగా గుర్తించారు. విషయాన్ని గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం దృష్టికి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిస్సార్ బేగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య తీసుకెళ్లి చర్చించారు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న ఆమెకు వెంటనే శస్త్రచికిత్స చేయలేమని హెచ్‌బీ 10 శాతానికి చేరుకున్న తర్వాత ఆపరేషన్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రక్తం ఎక్కిస్తూ వచ్చారు. హిమోగ్లోబిన్ శాతం మెరుగు పడిన తర్వాత బుధవారం డాక్టర్ షంషాద్‌బేగం నేతృత్వంలో డాక్టర్ నిస్సార్ బేగం, డాక్టర్ సౌజన్య, పీజీలు డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ రమణి, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్ర, స్టాఫ్‌నర్సులు సుప్రియ, ఉషారాణి బృందంగా ఏర్పడి శస్త్రచికిత్స చేశారు. దాదాపు రెండున్నర గంటల పాటు శ్రమించి 6 కిలోల బరువున్న భారీ కణితులను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం లక్ష్మి ఆరోగ్యం కుదుట పడుతోందని డాక్టర్ షంషాద్ బేగం తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అయ్యే ఈ తరహా శస్త్రచికిత్సను సర్వజనాస్పత్రిలో పూర్తి ఉచితంగా చేసినట్లు తెలిపారు. తొలగించిన కణితిని బయాప్సీకి పంపామని, క్యాన్సర్ నిర్ధారణ అయితే తదుపరి చికిత్సకు రెఫర్ చేస్తామని పేర్కొన్నారు.



శస్త్రచికిత్స అనంతరం రోగిని చూపుతున్న గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్ బేగం, వైద్య బృందం

# మంత్రి కేశవ్‌కు సమస్యల ఏకరవు

**కూడేరు:** మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏకరవు పెట్టారు. కూడేరు మండలం జయపురంలో బుధవారం మంత్రి కేశవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ ఆయనను కలిసి, సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రోజూ ఉదయం 6 గంటలకే పంచాయతీల్లో ఉండాలని, చెత్త సేకరణ, క్లోరినేషన్ చేసేటప్పుడు ఆ రోజు దిన పత్రిక పట్టుకొని నోట్ కమ్ ఫొటో దిగాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ, పంచాయతీ రాజ్ కమిషనర్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించినట్లు గుర్తు చేశారు. రోజూ ఉదయం 6 గంటలకే వెళ్లడం చాలా ఇబ్బందవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలను వేరు చేసి పంచాయతీరాజ్ పనులను మాత్రమే తమకు అప్పగించేలా చూడాలని విన్నవించారు. స్పందించిన మంత్రి.. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, కార్యదర్శులు రాఘవ, నాగరాజు, హరీష్, వెంకటనారాయణ,రమాదేవి, సుభాషిణి, లక్ష్మీకాంతమ్మ, సూర్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్యలు వివరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

### ఉపాధ్యాయులపై పని భారం పెంచడం సరికాదు : ఎస్టీయూ

**అనంతపురం ఎడ్యుకేషన్:** నూతనంగా తీసుకొచ్చిన విద్యాశక్తి ప్రోగ్రాంను బడి పనివేళల తర్వాత ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని ప్రభుత్వానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, రామాంజనేయులు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విధానాలతో దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల ఆరోగ్యం మరింత దెబ్బతిని రెగ్యులర్ బోధనకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. గత ఏడాది పదోతరగతికి వంద రోజుల కార్యాచరణ చేసిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకూ సీసీఎల్ వాడుకునేలా ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఎన్నికలు, ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లలో ఇప్పటి దాకా నమోదు చేయలేదన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.


### ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపీ

**గుత్తి:** ఉద్యోగాలు కల్పిస్తామని, సంక్షేమ పథకాలు వర్తింజేస్తామని ఇద్దరు యువకులపై సైబర్ నేరగాళ్ల వల విసిరి, డబ్బు దండుకున్నారు. వివరాలు.. గుత్తిలోని బీసీ కాలనీకి చెందిన రవికుమార్, కుళ్లాయప్పకు మూడు రోజుల క్రితం ఫోన్ కాల్ వచ్చింది. తాము అమరావతి నుంచి మాట్లాడుతున్నామని వెంటనే డబ్బు పంపితే ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడంతో పాటు ఉద్యోగాలు ఇప్పిస్తామని అవతలి వ్యక్తి నమ్మ బలికాడు. ప్రస్తుతానికి తమ వద్ద డబ్బు లేదని వారు తెలపడంతో ఇప్పుడు ఎంతుంటే అంత పంపాలని, మిగిలిన డబ్బు ఆ తర్వాత ఇవ్వాలన్నారు. దీంతో రవికుమార్ రూ. 22 వేలు, కుళ్లాయప్ప రూ. 15 వేలు ఫోన్ పే చేశారు. బుధవారం రవికుమార్, కుళ్లాయప్ప ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. దీంతో తాము మోసపోయామని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**గుత్తి:** స్థానిక జీఆర్‌పీ పరిధిలోని తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం మూడు భాగాలైంది. సంఘటనా స్థలాన్ని గుత్తి జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించి, కేసు నమోదు చేశాఉ.

### 'స్మార్ట్‌మీటర్ల'పై క్యూఆర్ కోడ్‌తో పోరాటం : సీపీఎం



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్:** స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై ప్రజా నిరసనను ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యవర్గ సభ్యులతో కలిసి స్మార్ట్‌మీటర్లపై వ్యతిరేకతను తెలిపేందుకు రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఈ నెల 6న ప్రజల ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ఈ విధానానికి స్వస్తి పలికేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి, చంద్రశేఖరరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఆర్థిక సంక్షోభంలో తాడిపత్రి మున్సిపాలిటీ

- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి

**తాడిపత్రి రూరల్:** సీఎఫ్ఎంఎస్ (కంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) వైఫల్యాల కారణంగా తాడిపత్రి మునిసిపాలిటీ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి కారణాలు విశదీకరించారు. మున్సిపాలిటీలో ఉన్న రూ.5 కోట్ల నిధులను ఖర్చు చేయలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. డీజిల్ బిల్లులు రూ.40లక్షలకు పైగా ఉన్నాయన్నారు. వాహనాల కోసం పెట్రోల్ బంకుల వద్దకు వెళితే పాత బకాయిలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, బలవంతం చేస్తే 30 లీటర్ల డీజిల్‌కు కేవలం 25 లీటర్లు మాత్రమే వేస్తూ 5 లీటర్లను మిగిల్చుకుంటున్నా ఏం చేయలేని పరిస్థితి ఉందన్నారు. డీజిల్‌లో ఎంతో అవినీతి జరుగుతున్నా అప్పు కోసం మౌనం వహించాల్సి వస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ కింద రూ.21కోట్ల బకాయిలకు గాను కేవలం రూ.67లక్షలు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి మునిసిపాలిటీకి రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరారు.

### 'సుప్రీం' నిర్ణయం హర్షణీయం

- విశ్రాంత జడ్జి కిష్టప్ప

**అనంతపురం ఎడ్యుకేషన్:** అనాదిగా అణచివేయబడిన ఎస్సీ, ఎస్టీలకు ఉన్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నిర్ణయించడం హర్షణీయమని విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉన్న ప్రతి పౌరునికి సమాన హక్కులు ఉండాలన్నారు. కానీ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు గడిచినా దేశంలోని ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్ల అమలు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ఉన్నతమైన మనసుతో ఆలోచించి ఉన్నత న్యాయస్థానాలలో కూడా ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు అమలు చేయాలని భావించడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు కూడా ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకాల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు.

### ప్రభుత్వాస్పత్రిలో అగంతకుడి హల్‌చల్

- వైద్యులు, పోలీసులపై దాడికి యత్నం

**గుత్తి:** స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఓ అగంతకుడు హల్‌చల్ చేశాడు. వైద్యులు, పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. వివరాలు.. ఒళ్లంతా గాయాలతో బుధవారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన యువకుడికి వైద్యులు, సిబ్బంది చికిత్స చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో యువకుడు తిరగబడ్డాడు. వైద్యులు, సిబ్బందిపై దాడికి ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా, వారిపై కూడా దాడికి ప్రయత్నించాడు. అతి కష్టంపై యువకుడికి చికిత్స అందించి పంపించారు. గతంలోనూ ఆకతాయిలు, తాగుబోతులు తమ విధులకు ఆటంకం కలిగిస్తూ దాడులకు ప్రయత్నించారని ఈ సందర్భంగా వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని కోరారు.

### మద్యం అక్రమ విక్రేతలపై చర్యలు

**అనంతపురం:** ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి కాకుండా ఇతరులు మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. రామమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి విక్రయాలపై 99896 28308కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.


# రాకెట్లలో దళిత యువ రైతుపై దాడి



బాధితుడు హనుమంతు

**ఉరవకొండ:** మండలంలోని రాకెట్లలో దళిత యువ రైతు హనుమంతుపై అదే గ్రామానికి చెందిన చిన్న సుంకప్ప కుటుంబసభ్యులు దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... రాకెట్లలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న దళిత వెంకటేష్ కుమారులు హనుమంతు, రామాంజనేయులు కలిసి ఇటీవల నెట్టం రాధాకృష్ణ నుంచి సర్వేనంబర్ 320–బీ1లోని 74 సెంట్లలో 15 సెంట్లను కొనుగోలు చేశారు. ఈ స్థలానికి చెక్కు బందీ మేరకు దక్షిణం వైపు బండి రస్తా ఉంది. భూమి విక్రయించే ముందు రాధాకృష్ణ కుటుంబసభ్యులు చూపించిన సర్వే హద్దుల్లోనే హనుమంతు సోదరులు పంట దిగుబడిని, పశువుల మేత వామిని హనుమంతు వేశాడు. అయితే ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన చిన్న గుండ్లొల్ల చిన్న సుంకప్ప కుటుంబ సభ్యులు రెండు నెలల క్రితం దౌర్జన్యంగా ఆక్రమించి, అందులో ఎరువులను, మట్టిని వేసుకున్నారు. తమ స్థలంలోకి ఎందుకు చొరబడుతున్నారని అడిగితే.. ఇది మాదే స్థలం అంటూ ఎదురు తిరిగారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఏడుగంటల సమయంలో మరోమారు మరికొంత స్థలాన్ని ఆక్రమించేందుకు ముళ్లకంపలు తొలగించడంతో హనుమంతు గమనించి ప్రశ్నించాడు. అంతే చిన్న సుంకప్ప, ఆయన కుటుంబ సభ్యులు చందు, మణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాదిగ లం... కొ.. అంటూ దూషణలకు పాల్పడటమే కాకుండా కిందపడేసి చెప్పులతో కొట్టారు. కాసేపటి తర్వాత పెదనాన్న, పెద్దమ్మ వచ్చి అతడిని వారి నుంచి విడిపించుకుని ఇంటికి తీసుకెళ్లారు. అయినా శాంతించని చిన్నసుంకప్ప కుటుంబ సభ్యులు మరోమారు ఇంటిలోకి చొరబడి హనుమంతుపై చెప్పులు, కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఆ రాత్రి భయంభయంగా గడిపిన బాధితుడు బుధవారం మధ్యాహ్నం ఉరవకొండ పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. తమ భూమిలోకి అకారణంగా ప్రవేశించి, ఆక్రమణకు పాల్పడి, ఇదేమని అడిగిన తనపై చెప్పులతో దాడిచేసి, కులం పేరుతో దూషించారని, వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# 103 మంది విద్యార్థులకు ఏకోపాధ్యాయురాలా?



నిరసన వ్యక్తం చేస్తున్న మలపనగుడి గ్రామస్తులు

- పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపిన గ్రామస్తులు

**డి హీరేహాళ్(రాయదుర్గం):** ఏకోపాధ్యాయురాలితో తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయంటూ కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్ మండలం మలపనగుడి గ్రామస్తులు బుధవారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. 103 మంది విద్యార్థులుంటే ఒక్క ఉపాధ్యాయురాలు ఎలా నెట్టుకొస్తోందో చెప్పాలంటూ నిలదీశారు. నిత్యం హాజరు వేయడం, అల్లరి చేయకుండా కంట్రోల్ చేయడం మినహా పుస్తకాలు తెరవలేక పోతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై ఎంఈఓకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రైవేటు బడుల్లో ఖరీదైన చదువులకు పంపడం తమ వల్లకాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

# మద్యం మత్తు.... యువత చిత్తు





ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు పూటుగా మద్యం సేవించి నేలపై పడిపోయాడు. ఇది ఎక్కడో కాదు. సాక్షాత్తూ తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద. యువకుడిని చూస్తూ లోపలకు వెళ్తున్నది తహసీల్దార్ విజయకుమారి. కూటమి ప్రభుత్వంలో యువత మద్యం మత్తులో ఏవిధంగా జోగుతున్నారో ఈ చిత్రమే ప్రత్యక్ష నిదర్శనం.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పాలచెర్ల గ్రామంలోని బెల్టుషాపు. ఏకంగా పాఠశాల ముందు ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం మద్యం లభిస్తోంది. దీంతో మందుబాబులు అక్కడే తిష్టవేసి నానాహంగామా సృష్టిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయినా ఇవేవీ ప్రభుత్వానికిగాని అధికారులకు గాని కనిపించవు.

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- గుడి, బడి తేడాలేకుండా అమ్మకాలు

రాప్తాడు: మద్యం మత్తులో యువత చిత్తవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరూరా బెల్టు షాపులు తెరిచి రాత్రీపగలు తేడాలేకుండా మద్యం విక్రయిస్తుంటడంతో యువత నిత్యం మద్యం మత్తులో జోగుతున్నారు. రాప్తాడు మండలంలో రాప్తాడులో ఒకటి, చిన్మయనగర్‌లో ఒక మద్యం షాపు ఉన్నాయి. మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా 30కి పైగా గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రెండు, మూడు చొప్పున మొత్తం 70కి పైగా బెల్టు షాపులు ఉన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్నే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా మద్యాన్ని ఏరులై పారిస్తూ జేబులో వేసుకుంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించేది. దీనికి తోడు ఉదయం 11 నుంచి సాయంత్రం 9 గంటల వరకే మద్యం విక్రయించేవారు. ఒక్క నిమిషం ముందుగాని, ఆలస్యంగా గాని షాపుల్లో మద్యం విక్రయాలు జరగకుండా స్కానర్లు పనిచేసేవి కాదు. దీనికి తోడు ఎక్కడా బెల్టు షాపులు లేకుండా పూర్తిగా కట్టడి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో రోజువారీ పనులు చేసుకునే వారు, ముఖ్యంగా యువత వేళాపాళా లేకుండా మద్యం తాగుతూ రోడ్ల మీద పడి దొర్లుతున్నారు. మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతుండడంతో మండలం మరో గోవాను తలపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.



బెల్టు దుకాణం కోసం మద్యం తరలిస్తున్న వ్యక్తులు

## 24 గంటల సర్వీస్

నిబంధన ప్రకారం మద్యం షాపు వద్ద మద్యం తాపించకూడదు. అయితే రాప్తాడులో మద్యం షాపు వెనుక, ముందు వైపు మద్యం ప్రియులు యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. మద్యం షాపు పక్కన, ముందు వైపు నివాసాలు ఉండడంతో రోజూ మద్యం సేవించే వారితో బీసీ కాలనీ వాసులు నిత్యం గొడవ పడుతూ ఉంటున్నారు. మద్యం షాపులో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే మద్యం దొరుకుతుంది. అయితే బెల్టు షాపుల్లో మద్యం ప్రియులకు 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటోంది. ఏ సమయంలో వెళ్లి తలుపు తట్టినా బెల్టు షాపుల నిర్వాహకులు తలుపులు తీసి మద్యం అమ్ముతున్నారు. ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు.

## ఫోన్ చేస్తే... డోర్ డెలివరీ

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు కావడంతో నిర్వాహకుల మధ్య పోటీ పెరిగిపోయింది. ఈక్రమంలో కాల్ చేసే డోర్ డెలివరీ కూడా చేస్తామంటూ షాపుల దగ్గర బోర్డులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. మద్యం ప్రియులు వ్యవసాయ తోటల్లో మద్యం సేవిస్తుండగా మద్యం అయిపోయిందని వెంటనే తీసుకుని రావాలని ఫోన్ చేయగా బెల్టు షాపుల నిర్వాహకులు తోటల దగ్గరకు వెళ్లి డోర్ డెలివరీ చేస్తున్నారు. మరూరు గ్రామంలో పవిత్ర పుణ్యక్షేత్రం చిన్న కదిరయ్య ఆలయం పక్కనే బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారు. మందు బాబులు అతిగా మద్యం సేవించి ఆలయానికి వచ్చిన మహిళలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇక అయ్యవారిపల్లి నుంచి మరూరు వరకు హైవేపై 30కి పైగా ధాబాలు ఉన్నాయి. ధాబాల్లో మద్యం తాగిన యువకులు గొడవలు చేసుకుంటున్నట్లు సమాచారం. నెల నెలా మామూళ్లు అందిస్తుండడంతో అధికారులు, సిబ్బంది మద్యం అక్రమ విక్రయాలను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో బెల్ట్ దుకాణానికి నెలకు రూ.3 వేలను ఎక్సైజ్ పోలీసులకు లంచాల రూపంలో ఇస్తున్నట్లు సమాచారం.

# కార్మికులకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి



మునిసిపల్ కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న ఓబిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మునిసిపల్ కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, రాష్ట్ర నేత కొర్రపాడు హుస్సేన్ పీరా పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం ముందు గత 13 రోజులుగా సమ్మె చేస్తున్న ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్‌కు ట్రేడ్ యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో కార్మికులకు వేతనాలు పెంచారని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలకు కూడా అవకాశం ఇచ్చారన్నారు. యూనియన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలకు పరిష్కారం చూపే వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగరాధ్యక్షుడు మార్కెట్ ఖాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపంగి రామాంజినేయులు, ప్రకాష్, కార్యదర్శి అనిల్‌కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజారత్నం, నాయకులు పుల్లారెడ్డి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామాంజినేయులు, కే శ్రీనివాసులు, సంగమేష్, మనీ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన ఎగుమతులకు మెండుగా అవకాశాలు



మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పండించే ఉద్యాన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉన్నందున ఎగుమతులకు సరిపడా నాణ్యమైన ఫలసాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా), ఉద్యానశాఖ, గ్రాంట్ క్వాంటం సంస్థ సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహించారు. ఇందులో రైతులు, ఉద్యానశాఖ క్షేత్రస్థాయి అధికారులు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, నాబార్డు డీడీఎం అనురాధ, ఉద్యానశాఖ ఏడీ దేవానంద్ తదితరులు మాట్లాడుతూ... ఎగుమతుల నిబంధనలు, విధి విధానాలు తెలుసుకుని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ఉద్యాన ఉత్పత్తులు పండించేలా చూడాలన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించండి

రాప్తాడు: భూ సమస్యలపై 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ అధికారులను ఆదేశించారు. జూన్ 30వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో గంగలకుంట గ్రామానికి చెందిన కాశీనాథ్, గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లెల జయలక్ష్మి భూ సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించడంతో బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ రెండు గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ సమస్యలను వీలైనంత వరకూ మండల కేంద్రాల్లోనే పరిష్కరించాలన్నారు. అప్పుడు ప్రజలకు జిల్లా కేంద్రానికి రావాల్సిన పని ఉండదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయకుమారి, ఆర్ఐ రాగే కరుణాకర్, వీఆర్ఓ గీతా రాణి తదితరులు పాల్గొన్నారు.

## 'డబ్బులు తీసుకుంటే ఇంటికే'

అనంతపురం మెడికల్: గైనిక్, లేబర్ తదితర వార్డుల్లో గర్భిణులు, బాలింతలు, రోగుల నుంచి ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు రుజువైతే ఇంటికెళ్తారని గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి హెచ్చరించారు. బుధవారం ఆమె సర్వజనాస్పత్రిలోని ఎఫ్ఎన్ఓలతో సమావేశమయ్యారు. జాబ్‌చార్ట్ ప్రకారం ప్రతి ఒక్కరూ తమ విధులను గురుతర బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. రోగులను సకాలంలో స్కాన్, ఎక్స్‌రే, శస్త్రచికిత్సలు, తదితర ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎక్కడైనా రోగులు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాబాయి తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి చేసుకోకపోతే.. చంపేస్తా

అనంతపురం: పెళ్లి చేసుకోకపోతే చంపేస్తా అంటూ ఓ యువతిపై దాడి చేసిన యువకుడు ఘటన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. పుట్లూరు మండలం శనగల గూడూరుకు చెందిన యువతి సాయినగర్ ఏడో క్రాస్‌లోని లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. రెండు సంవత్సరాల క్రితం అనంతపురం నగరంలోని బస్టాండు వద్ద ఉన్న ప్రియదర్శిని హోటల్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్న ఈమెకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం అగ్రహారంకు చెందిన ప్రవీణ్ కుమార్ పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుందాం అని చెప్పగా యువతి నిరాకరించింది. ఈ క్రమంలోనే ఇటీవల విద్యుత్ నగర్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు హోంలోన్ విభాగంలో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరింది. విషయం తెలుసుకున్న ప్రవీణ్ కుమార్ మళ్లీ ఆమె వెంటపడుతూ పెళ్లి చేసుకోవాలని వేధించడం ప్రారంభించాడు. మంగళవారం హాస్టల్ వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. బైకులో బలవంతంగా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి దాడి చేశాడు. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటే చంపుతా అని బెదిరించాడు. తిరిగి బైక్‌పై హాస్టల్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీనిపై తన సోదరితో కలిసి యువతి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## నట్టల నివారణ మందు పంపిణీ

రాప్తాడు: జీవాలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా నట్టల నివారణ మందును వేయించాలని పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ టీ.వీ.సుధాకర్ గొర్రెలు, మేకల పెంపకందారులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని గొల్లపల్లి, రామినేపల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పాడి పశువులు తైలేరియాసిస్(గడ్డల వాపు జ్వరం) వ్యాధి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ టీ.వీ.సుధాకర్ రైతులకు సూచించారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పర్యటించారు. హెచ్ఎఫ్, జెర్సీ ఆవులకు నష్టం కలిగించే తైలేరియాసిస్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు.

## చంద్రబాబు కొట్టాలలో గ్యాంగ్ వార్

అనంతపురం: రుద్రంపేట పంచాయతీలోని చంద్రబాబు కొట్టాలలో బుధవారం మధ్యాహ్నం గ్యాంగ్ వార్ జరిగింది. ముత్యాలమ్మ గుడి సమీపంలో కొంతమంది కర్రలతో దాడి చేసుకుంటూ, రాళ్లు విసురుకుంటూ బీభత్సం సృష్టించారు. పగలు గస్తీ తిరుగుతున్న పోలీసులు అక్కడికి వెళ్లి వారించి ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేశారు. ఒక వర్గంలో తిమ్మన్న కుమారుడు ఎం.రాజు, సహదేవ రాజు కుమారుడు ఏలూరు చిన్నా, ఎస్. మహబూబ్ బాషా కుమారుడు సయద్ షాహీద్, మరొక వర్గానికి చెందిన కె.మున్వర్ కుమారుడు కె.మహమ్మద్ అఫ్రీద్, రషీద్ కుమారుడు షేక్ షోదియాను అరెస్ట్ చేసి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బహిరంగ ప్రదేశాల్లో గొడవ పడుతూ.. పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించారని కేసు నమోదు చేశారు.

## ప్రశాంతంగా 'సమగ్ర' ఉద్యోగుల బదిలీలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఏపీసీ టి.శైలజ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియలో జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు బయట జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీ కోరుకున్న ఉద్యోగులు హాజరయ్యారు. అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 128 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 45 మంది బదిలీ అప్షన్లు తీసుకున్నారు. 58 మంది నాట్ ఆప్టెడ్ ఇచ్చారు. 25 మంది గైర్హాజరయ్యారు.

## సమన్వయంతో పనుల్లో పురోగతి సాధిస్తా

అనంతపురం సిటీ: కింది స్థాయి ఉద్యోగులను సమన్వయం చేసుకుని ప్రగతి పనుల్లో పురోగతి సాధించి జిల్లాను మొదటి స్థానంలో నిలబెడతానని పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనను పీఐయూ ఈఈ నవీన్‌కుమార్, డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, రవీంద్ర, జింకల కృష్ణజ్యోతి, పీఏ రాజేంద్రప్రసాద్, ఏఈ హుస్సేన్‌బాషా, శ్రీనివాసకుమార్, సూపరింటెండెంట్లు ఖాజా మొహిద్దీన్, రమాదేవి, టెక్నికల్ ఆఫీసర్ కృష్ణానాయక్, డీఈఓ రాజేశ్వరి, శ్రీలక్ష్మి సహా ఇతర ఉద్యోగులందరూ మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

**ఈఈగా నవీన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ**

పంచాయతీరాజ్ అనుబంధ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఈఈగా నియమితులైన నవీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

## సంక్షిప్త వార్తలు

**'తూమాటి జీవనయానం' పుస్తకావిష్కరణ**

అనంతపురం కల్చరల్: అనంత ఖ్యాతిని ఇనుమడింపచేసిన ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. డాక్టర్ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో డాక్టర్ సుధాకరనాయుడు రచించిన 'ఆచార్య తూమాటి దొణప్ప జీవనయానం' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజ్ ఉద్యానవనంలో జరిగిన సమావేశంలో రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ త్వరలో అనంత వేదికగా తూమాటి దొణప్ప శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో శాంతినారాయణ, మానవత తరిమెల అమరనాథరెడ్డి, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా తదితరులున్నారు.

**నేడు మండల సర్వసభ్య సమావేశం**

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరవుతారన్నారు.

**'వర్సిటీ అధికారుల అడ్డగోలు నిర్ణయాలు'**

అనంతపురం: రాజకీయ నాయకుల గుప్పిట్లో చిక్కుకున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ ఎస్కేయూ కార్యదర్శి రమణయ్య ఓ ప్రకటనలో ఆరోపించారు. వర్సిటీ జన్మభూమి క్యాంటీన్, ఇతర షాపుల టెండర్లను బుధవారం ఖరారు చేశారని, విద్యార్థులకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండానే అస్మదీయులకు కట్టబెట్టారని విమర్శించారు. క్యాంటీన్‌లో పొందుపరిచిన రేట్లు కాకుండా అధిక ధరలు నిర్ధారించడంతో విద్యార్థులపై భారం పడుతుందని పేర్కొన్నారు.

**అడ్వెంట్ గ్లోబల్ కంపెనీతో అవగాహన**

అనంతపురం:జేఎన్‌టీయూ(ఏ)తో అడ్వెంట్ గ్లోబల్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి వీలుగా ఒప్పందం దోహదపడనుంది. అడ్వాన్స్ ల్యాబోరేటరీస్, డ్రోన్ కిట్స్, ఐఓటీ, అటానమస్ సిస్టమ్స్, క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన ల్యాబ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఆ కంపెనీ ప్రతినిధులు జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావుతో భేటీ అయ్యారు.కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, అడ్వెంట్ గ్లోబల్ డైరెక్టర్ కేవీ రంగా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ భరతపూడి తదితరులు పాల్గొన్నారు.

**'సూపర్‌సిక్స్' అమలులో విఫలం**

అనంతపురం అర్బన్: సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య విమర్శించారు. హామీల అమలుకు సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా తలపెట్టామన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో లింగమయ్య మాట్లాడారు. చేతివృత్తిదారులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు నాగప్ప, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### దగ్గుపాటీ.. మతి భ్రమించిందా?



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని నగర మేయర్ వసీం ధ్వజమెత్తారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా ఈ నెల 1న దగ్గుపాటి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఏక కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే ఒకేసారి 17 వైద్య కళాశాలలు, 70 వేల మందికి పైగా ఉపాధి కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న తీసుకువచ్చిన సంస్కరణలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆదర్శంగా తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదెవరో చెప్పాలన్నారు. ఎన్నడూ లేని విధంగా భయానక వాతావరణాన్ని సృష్టించి, అలజడులకు కారణమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వైఎస్ జగనన్న గురించి మాట్లాడేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

### కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ఆదరణ



అనంతపురం: అనంతపురంలోని అంబేడ్కర్ భవన్ సాయినగర్-8వ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైనర్, పోచంపల్లి చీరలు, డ్రస్ మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్స్ షర్టింగ్స్, జ్యువెల్లరీ, బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు. అలాగే ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ రకాల డ్రెస్ మెటీరియల్, స్టోన్ జ్యువెల్లరీ, పెరల్స్, క్రాఫ్ట్‌స్‌తో పాటు పలు రకాల వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా ఉంటుందన్నారు.

### ఆందోళనకరంగా యువతుల మిస్సింగ్

అనంతపురం: వరుసగా చోటు చేసుకుంటున్న యువతుల మిస్సింగ్ ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రతినిధులు అన్నారు. ఆయా ఘటనలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ మేరకు అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజులుగా జిల్లా పరిధిలో పలు పోలీస్‌స్టేషన్లలో మిస్సింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. మహిళల అక్రమ రవాణా ఉన్నట్లయితే కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు జి. లక్ష్మిదేవి, బి. యశోధమ్మ తదితరులున్నారు.

### 'గందరగోళంగా డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్'

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాలు మూడు నెలల కిందట విడుదలైనా ఇప్పటి దాకా డిగ్రీ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో గందరగోళం నెలకొందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మండిపడ్డారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వెంటనే డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న అశాస్త్రీయ విధానాలతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు దాపురించాయన్నారు.

### పంచాయతీ అభివృద్ధికి పాటుపడదాం

ఆత్మకూరు: పంచాయతీ అభివృద్ధికి సమష్టిగా పాటుపడదామని సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి తెలియజేశారు. బుధవారం ఆత్మకూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేసి ఆత్మకూరు పంచాయతీని ఆదర్శంగా నిలుపుదామన్నారు. సమావేశంలో ఎంపీపీ హే మలత, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి పాల్గొన్నారు.

### పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి అనంతపురం రూరల్ మండల పరిధిలోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. కుటుంబానికి ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఈ నెల 10లోగా గ్రామ క్షేత్ర సహాయకుల వద్ద లేదా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి: మండల వ్యవసాయాధికారి (ఏఓ)గా బి.మాధురి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఏఈఓ రామాంజినేయులు, స్థానిక వ్యవసాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**మార్కెట్‌యార్డ్ ఇన్‌చార్జి సెక్రటరీ**

అనంతపురం అగ్రికల్చర్: రాప్తాడు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఇన్‌చార్జి సెక్రటరీగా రూప్‌కుమార్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకాలం ఇక్కడ పనిచేస్తున్న రామ్‌ప్రసాద్ గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు.

### విద్యార్థులే భవిష్యత్ సారథులు

రాప్తాడు: నేటి విద్యార్థులే దేశ భవిష్యత్ సారథులని సీఐ శ్రీహర్ష అన్నారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని ఎల్ఆర్‌జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఇన్వెస్ట్చర్ (పాఠశాలలో కెప్టెన్, వైస్ కెప్టెన్స్, ప్రిఫెక్ట్‌ల ఎంపిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చెప్పినట్లుగా దేశాన్ని నడిపించాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బొంతు ప్రసాద్, కరస్పాండెంట్ శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్వీఐటీకి అటానమస్ హోదా



రాప్తాడు: హంపాపురం సమీపంలోని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలకు అటనమస్ హోదా దక్కింది. బుధవారం జేఎన్‌టీయూ (ఏ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అటనమస్ హోదా ఉత్తర్వులను కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, కళాశాల చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ... క్రమశిక్షణతో కూడిన విద్య అందించడమే తమ కళాశాల ధ్యేయమన్నారు. అందుకే కళాశాలకు అటానమస్ హోదా లభించిందన్నారు. ఇది తమకెంతో గర్వకారణమన్నారు. పోటీ ప్రపంచంలో రాణించేలా తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికి చెందిన బండి నాగార్జున (32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య చందన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొర్రెల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యాపారంలో నష్టపోవడంతో రూ.15 లక్షల వరకూ అప్పులు తీర్చాల్సి వచ్చింది. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక మంగళవారం రాత్రి తన ఇంటి ఎదుట ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశారు.

### భార్యపై హత్యాయత్నం

అనంతపురం: నగరంలోని భవానీ నగర్‌లో భార్యపై భర్త హత్యాయత్నం చేశాడు. బాధితురాలి కథనం మేరకు.. స్థానికంగా నివాసం ఉండే మునీంద్ర, ధనలక్ష్మి దంపతులకు వివాహమై 20 ఏళ్లు అవుతోంది. వీరికి ముగ్గురు కుమార్తెలు. ఒకరికి వివాహమైంది. ఇంట్లో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో మునీంద్ర చున్నీతో భార్య ధనలక్ష్మి మెడకు బిగించి..సూపర్ వాస్మోల్ తాపించి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు ఆమెను రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### జగనన్నను కలసిన నేతలు



వైఎస్ జగన్‌ను కలసిన కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, సాకే చంద్ర



అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగరాధ్యక్షుడు దత్తా తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ సూచించినట్లు వారు తెలిపారు.